సాక్షి పార్వతీపురం మన్యం

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



'పొలంపిలుస్తోంది'కి స్పందన కరువు - 8లో

ప్రభుత్వం తలపెట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి రైతుల స్పందన కరువైంది.



దొంగల వీరవిహారం..! - 8లో

గజపతినగరం మండల కేంద్రంలో శుక్రవారం వేకువజామున దొంగలు హల్‌చల్ చేశారు. దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు.



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి - 8లో

పార్వతీపురం జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష

పార్వతీపురం టౌన్: జిల్లాలోని నాలుగు ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల సాలూరు, మక్కువ, కురుపాం, భామిని ఆదర్శ పాఠశాలల్లో ఏప్రిల్ 20న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఎంఎస్. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 1 సెప్టెంబరు 2013 నుంచి 31 ఆగస్టు 2015 మధ్యలో పుట్టి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 1సెప్టెంబరు 2011 నుంచి 31 ఆగస్టు 2015 మధ్యలో పుట్టి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా చదివి ఉండాలని పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలని స్పష్టం చేశారు.

2.75 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్



కర్మాగారం వద్ద క్రషింగ్‌కు తీసుకొచ్చిన చెరకు

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2.75 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందని కర్మాగార యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి చెరకును క్రషింగ్ కోసం సకాలంలో ఫ్యాక్టరీకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి చెరకును నరికించే ఏర్పాట్లు చేశామని వివరించారు.

బంగారు భవితకు పదో తరగతి ప్రథమ మెట్టు

- డీఈఓ తిరుపతినాయుడు



అజ్జాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ఎన్.తిరుపతినాయుడు

బలిజిపేట: విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి ప్రథమ మెట్టని, సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు సూచించారు. అజ్జాడ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. విద్యార్థుల ప్రీ ఫైనల్ జవాబు పత్రాలను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా ఎవరికి ఎటువంటి సమస్యలున్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి పరిష్కరించుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుకోగలరన్నారు. మానసిక ఒత్తిడికి గురికాకూడదన్నారు. చేతిరాత, పరీక్ష రాసే విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్‌సీడీ 3.0 సర్వే

- క్షేత్ర స్థాయిలో ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించాలి
- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: అసంక్రమిత, దీర్ఘకాలిక వ్యాధులు గుర్తించేందుకు చేపడుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వేను పారదర్శకంగా నిర్వహించి, ప్రజల్లో రక్తపోటు, మధుమేహం, గుండె సమస్యలు, క్యాన్సర్ లక్షణాలను గుర్తించాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు వైద్య సిబ్బందికి సూచించారు. పార్వతీపురంలోని ఎన్‌జీఓ భవనంలో ఆరోగ్య పర్యవేక్షకులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టే సర్వేలను పక్కాగా చేపట్టాలన్నారు. వ్యాధుల వ్యాప్తి, కారణాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలితో ఆరోగ్యం సిద్ధిస్తుందన్న అంశాన్ని తెలియజేయాలన్నారు. జ్వరాలు, డయేరియా వంటి వ్యాధుల వ్యాప్తిని ఉన్నతాధికారులకు సత్వరమే తెలియజేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.నారాయణరావు, టి.జగన్మోహన్ రావు, ఎం.వినోద్, పి.శ్రీధర్ పాల్గొన్నారు.

గంటల బండికి... సమస్యల మంట





- అగ్నిమాపక కేంద్రాల్లో సమస్యల నెలవు
- సిబ్బంది కొరత..
- నీటిని నింపేందుకూ ఇబ్బందులే..
- రక్షణ పరికరాలూ కరువు
- వేసవిని దాటేదెలా?

సాక్షి, పార్వతీపురం మన్యం/పాలకొండ రూరల్/సాలూరు/గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురంతో పాటు.. పాలకొండ, సాలూరు, గుమ్మలక్ష్మీపురాల్లో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. అగ్నిప్రమాదాలతో పాటు, అత్యవసర సమయాలు, ప్రాణాపాయాలు, రహదారి ప్రమాదాల్లో ఫైర్ సిబ్బంది సేవలు తప్పనిసరిగా అవసరం. ప్రధానంగా వేసవి అంటేనే ఆకురాల్చే సమయం. గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. చిన్నపాటి ప్రమాదం సంభవించినా గణగణమంటూ గంటల బండి వెళ్లాల్సిందే. మంటలను అదుపు చేయాల్సిందే. ఆపదొస్తే ఆదుకునే అగ్నిమాపక శకటాలే నేడు సంకట స్థితిలో ఉన్నాయి. ఎప్పుడో దశాబ్దాల నాటి వాహనాలే దిక్కవుతున్నాయి. వాటికీ నిలువ నీడ ఉండడం లేదు. దీనికితోడు.. కష్టమొస్తే వచ్చే సిబ్బంది సరిపడా లేకపోవడం లోటే. ఇందులో నైపుణ్యం ఉన్నవారిని వేలిమీద లెక్క పెట్టవచ్చు. ఏదో ఉన్నారంటే ఉన్నారు.. ఓ శాఖ నడుస్తోందంటే నడుస్తోంది. ఇదే అగ్నిమాపక శాఖ దీన పరిస్థితి.



కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న పాలకొండ అగ్నిమాపక కేంద్రం

జిల్లా కేంద్రంలో ఉన్నా సరే..



మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

పేరుకు జిల్లా కేంద్రంలో ఉన్నా సరే.. పార్వతీపురం అగ్నిమాపక కేంద్ర పరిస్థితి మిగతా వాటికి భిన్నమేమీ కాదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ కష్టమొచ్చినా ఇక్కడ నుంచే వాహనం కదలాలి. ఉన్నది ఒక్కటే వాహనం. మొత్తం ఫైర్ మెన్స్ తొమ్మిది మంది ఉండాలి. ప్రస్తుతం ముగ్గురే ఉన్నారు. ఇద్దరు హోంగార్డులతో సరిపెట్టుకుంటున్నారు. ఆరుగురు సిబ్బంది కొరత ఉంది. ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా.. వారూ విడతలవారీగా పని చేస్తారు. ఒక వెహికల్(జీపు) ఉన్నా.. డ్రైవర్ లేరు. ఒకే సమయంలో రెండు, మూడు ప్రమాదాలెదురైతే.. ఎవరెటు వెళ్లాలో తెలియని పరిస్థితి.

40 ఏళ్లుగా అదే శిథిల భవనంలో..

డివిజన్ కేంద్రం పాలకొండలో 1984 సంవత్సరంలో అగ్నిమాపక కేంద్రం కేటాయించారు. 1986లో వీరఘట్టం రోడ్డులో భవన నిర్మాణం పూర్తి చేసుకొని సేవలు ప్రారంభమయ్యాయి. నాటి భవనానికి 40 ఏళ్ల పూర్తి కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. అగ్నిమాపక అధికారితో సహా ప్రస్తుతం ఎనిమిది మంది విధులు నిర్వహిస్తున్నారు. ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నలుగురు హోంగార్డులతో ఈ ఖాళీలను తాత్కాలికంగా భర్తీ చేశారు. స్థానిక కేంద్రం ద్వారా పాలకొండ, వీరఘట్టం, సీతంపేట మండలాల్లో 200 గ్రామాల వరకు సేవలు అందించాల్సి ఉంది. దీంతోపాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో వంగర, రేగిడి, బూర్జ, కొత్తూరు మండలాలకు కూడా సేవలందిస్తున్నారు. 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకుతో కూడిన శకటం 2012లో సమకూర్చారు. దీనికి కూడా దశాబ్ద కాలం పూర్తి కావచ్చింది. ట్యాంకులో నీరు నింపేందుకు కార్యాలయం పక్కనే ఉన్న రాయుడు కోనేరు.. నేడు రూపు కోల్పోవడంతో నీటిని నింపేందుకు అవస్థలు తప్పడం లేదు. ఉన్న భవనం శిథిలం కావడంతో అధునాతన పరికరాలు మంజూరు చేయడం లేదు. వాటిని భద్రపరిచేందుకు అవకాశం లేకపోవడమే ఇందుకు కారణం. సిబ్బంది కొంతమేర నిధులు సేకరించుకొని ప్రధాన కార్యాలయం ముందర చిన్నపాటి షెడ్డు ఏర్పాటు చేసుకొని విధులు కొనసాగిస్తున్నారు.



పార్వతీపురంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

వేసవిని ఎదుర్కోవడంపై...

మరోవైపు వేసవిలోనే ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖాధికారు లు సూచిస్తున్నారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను అరికట్టగలమని చెబుతున్నారు.

- జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల పరిధిలో అన్ని వాహనాలనూ కండీషన్‌లో ఉంచడం..
  ఎటువంటి అత్యవసర పిలుపుకైనా సిద్ధంగా ఉండేలా సిబ్బందిని సన్నద్ధం చేయడం..
- అగ్నిమాపక సిబ్బంది సెలవులు తగ్గించడం
- పెట్రోల్ బంకులు, ఆస్పత్రులు, గ్యాస్ గోదాములు, షాపింగ్ మాల్స్, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా అగ్నిమాపక శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నంబర్
101, 08963-221101, 99637 29673, 99499 91053
నంబర్లను సంప్రదించవచ్చని చెబుతున్నారు.

సాలూరు.. ప్రమాదం జరిగితే అంతే



సాలూరు అగ్నిమాపక కేంద్రం

సాలూరులో తొమ్మిది మంది రెగ్యులర్ సిబ్బంది అవసరం. పోలీస్ శాఖకు చెందిన ఐదుగురు హోంగార్డులను డిప్యూటేషన్‌పై పంపారు. శిక్షణ పొందిన ఫైర్‌మెన్లు ఇద్దరు ఉన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఒకరే ఉన్నారు. ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా.. ఇద్దరే ఉన్నారు. నైపుణ్యం గల సిబ్బంది కొరత ఉంది. సాలూరు కేంద్రంలో నీటి నిల్వ చేయాల్సిన రెండు ట్యాంకులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీనిపై ఇక్కడి అగ్నిమాపక శాఖాధికారి రాజారావు వద్ద ప్రస్తావించగా.. ట్యాంకు లీకవుతున్నట్లు తెలిపారు. అందువల్లే నీటిని నిల్వ చేసి ఉంచడం లేదని సమాధానమిచ్చారు. ప్రమాదం జరిగిన సందర్భంలో చెరువులు, నీటి కాలువల వద్దకు వెళ్లి నీటిని పట్టాల్సిన పరిస్థితి. ఫైర్‌స్టేషన్‌లో సౌకర్యాలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి. ఏదైనా అత్యవసర సమయంలో వెళ్లి, నీటిని నింపుకొని తెచ్చి వెళ్లే వరకూ ప్రమాదం ఆగుతుందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

శాఖను వదిలేశారు..

మరోవైపు ఉన్నతాధికారుల నుంచి కూడా ఆ శాఖను పూర్తిగా వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సింగిల్ స్టేషన్స్, డబుల్‌స్టేషన్స్ అనే రెండు కేటగిరీలు ఉంటాయి. అగ్నిమాపక శాఖ అంటేనే తరచూ అగ్ని ప్రమాదాలు, రెస్క్యూ ఆపరేషన్స్ ఉంటాయి. ఆ స్థాయి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు రక్షణ పరికరాలు సిబ్బందికి ఉండాలి. కొంతకాలంగా శాఖలో ఏ విధంగానూ కేటాయింపులు ఉండటం లేదు.

- అనారోగ్యం, ఇతర సమస్యలతో సిబ్బంది మరణాలు సంభవించడం.. కొత్త నియామకాలు లేకపోవడం వల్ల సిబ్బంది భర్తీ జరగడం లేదు.
- ఉద్యోగులకు పర్సనల్ ప్రొటెక్షన్ అక్విప్‌మెంట్స్ కూడా లేవు. బడ్జెట్ కేటాయింపులు శూన్యం.
- సిబ్బందికి కావాల్సిన గమ్ బూట్లు, హెల్మెట్లు, వ్యక్తిగత రక్షణ సామగ్రి ఇవ్వడం లేదు.
- ఏ కేంద్రంలోనూ ల్యాండ్ లైన్ కూడా పని చేయని పరిస్థితి ఉంది. టోల్‌ఫ్రీ నంబర్ పని చేయకపోవడంతో ఎవరిని సంప్రదించాలో తెలియని దుస్థితి.
- అసలే సమస్యల్లో ఉండటం వల్ల ప్రమదాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేలా చేపట్టే అవగాహన కార్యక్రమాలు కూడా తూతూమంత్రంగా సాగుతున్నాయి.

వేసవి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం..



వేసవి ప్రమాదాలపై ప్రజలను చైతన్యవంతం చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. చిన్న సమస్యలు మినహాయించి, పెద్ద ఇబ్బందులేమీ లేవు. వాహనాలన్నీ కండీషన్‌లోనే ఉంచాం. సిబ్బంది అందరూ సరిపడా ఉన్నారు. జిల్లా విభజన తర్వాత అధునాత పరికరాలు కూడా మన వద్ద ఉన్నాయి. ఇరుకైన సందుల్లోనూ వెళ్లేలా వాహనాలు, రిజర్వాయర్ల నుంచి రక్షించేలా పరికరాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదాల విషయంలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని విజ్ఞప్తి. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లా కార్యాలయంతోపాటు, పార్వతీపురం అగ్నిమాపక కార్యాలయం ఒకే చోట ఉండేలా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీప్లస్ విధానంలో నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం.

– కె.శ్రీనుబాబు, డీడీఆర్, ఎఫ్‌వో, పార్వతీపురం మన్యం జిల్లా

గిరిజన ప్రాంతాలకు ఆ సేవలే ఆధారం.. సిబ్బందే లేరు...

గుమ్మలక్ష్మీపురంలో అగ్నిమాపక కేంద్రం ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలతో పాటు, కొమరాడ మండలంలోని నాగా వళి నది ఇవతలి ప్రాంత పరిధిలోని గ్రామాలకు ఈ కేంద్రం సేవలే అందుతాయి. ఫైర్ ఆఫీసర్‌తో పా టు.. మొత్తం 20 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఎనిమిది మందే ఉన్నారు. 12 ఖాళీలు ఉన్నాయి. ప్రారంభంలో కేటాయించిన మూడు వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో మూడేళ్ల కిందట నూతన వాహనం కొనుగోలు చేశారు.



గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక కేంద్రం

అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వద్దు...

- కొన్నిచోట్ల కమర్షియల్ యాజమాన్యాల వారు ప్రమాదాల నివారణ కోసం కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. దీనివల్ల ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే బయటపడే మార్గం కనిపించడం లేదు.
- కొన్ని సందర్భాల్లో ప్రజల నుంచి అగ్నిమాపక సిబ్బందికి వింత పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తుల నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఆ తర్వాత ఆ నంబరుకు ఎంత చేసినా ఫోన్ ఎవరూ తీయట్లేదని... ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని సిబ్బంది వాపోతున్నారు. పార్వతీపురం, గరుగుబిల్లి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

మ్యుటేషన్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: రెవెన్యూ సదస్సులు, గ్రామ సభల్లో వచ్చిన మ్యుటేషన్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి రెవెన్యూకు చెందిన పలు అంశాలపై జేసీ శోభికతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను పీజీఆర్ఎస్‌లో కాకుండా సర్వీసెస్‌లో నమోదు చేయాలన్నారు. న్యాయపరంగా ఎటువంటి సమస్యలు లేని భూములకు చెందిన మ్యుటేషన్లను వెంటవెంటనే పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ సర్వీసులను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్లు ఆశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ కె.హేమలత, కేఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ పి.ధర్మాచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, సివిల్ సప్లై డీఎం పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి


- పోలీస్ అధికారులకు పిలుపునిచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: వచ్చేనెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్‌కుమార్, ఏఎస్పీ అంకిత సురాన అన్నారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజీ కాదగ్గ అన్ని క్రిమినల్, చెక్ బౌన్స్ కేసులను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవీరత్నకుమారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి.రమ్య, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామతీర్థంలో మహాశివరాత్రి ఏర్పాట్లు



రామతీర్థంలో క్యూల ఏర్పాటును పరిశీలిస్తున్న ఈఓ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయంలో క్యూల ఏర్పాట్లను ఈఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శివరాత్రి రెండు రోజులు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు పులిహోరా, శనగల ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అమ్మకానికి సుమారు 30వేల లడ్డూలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, వివిధ సేవా సంఘాల సభ్యులు విధులు నిర్వర్తిస్తారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో ఆదర్శంగా నిలవాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గరుగుబిల్లి: ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ఆప్యాయతను చూపి మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్ విభాగం, వ్యాక్సినేషన్, రక్తనమూనా కేంద్రం, మందుల నిల్వలు, లేబర్ గదులను నిశితంగా పరిశీలించారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల వివరాలు, టీబీ రక్తనమూనా పరీక్షల సమగ్ర వివరాల రికార్డుల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. మందుల నిల్వలపై ఫార్మాసిస్ట్ సుకన్యను ప్రశ్నించారు. గర్భిణులకు అవగాహన కల్పించడంతో పీహెచ్‌సీకి ప్రసవ కేసులు పెరిగినట్లు వైద్యులు కె.కీర్తి, కె.కార్తీక్ తెలిపారు. రక్తహీనతను అధిగమించేందుకు ఎనీమియా యాక్షన్ కమిటీ సమర్థంగా పనిచేయాలన్నారు. పాఠశాల విద్యార్థులకు న్యూట్రి కిట్స్‌ను అందించాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పక్కాగా జరగాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాధులు (ఎన్‌సీడీ–నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్)లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం నిర్మాణం చివరిదశలో ఉన్న ఐసోలేషన్ వార్డు భవనాన్నిపరిశీలించారు.

ఆరోగ్యమిత్రల పోరుబాట

- ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం
- ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన చెందుతున్న ఆరోగ్య మిత్రలు
- మార్చి 10, 17, 24 తేదీల్లో విధుల బహిష్కరణకు నిర్ణయం



పార్వతీపురం: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్) పథకం రోగులకు వైద్య సేవలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న వైద్యమిత్రలకు భరోసా కరువైంది. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని బీమా కంపెనీకి అప్పగిస్తారన్న ప్రకటన వైద్యమిత్రలను ఆవేదనకు గురిచేస్తోంది. 17 ఏళ్లగా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి నేడు ఆధారం కోల్పోతామేమోనన్న భయం వెంటాడుతోంది. వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు, జిల్లా మానిటరింగ్ యూనిట్ సిబ్బందికి కనీస వేతనం అమలు జరగక ఆందోళన చెందుతున్నారు. కనీసవేతనాలు అమలుచేయాలని వైద్యశాఖ మంత్రికి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడం నిరాశకు గురిచేసింది. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఉంచుతారా.. లేక ప్రైవేటుకు అప్పగిస్తారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఎన్నోఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సర్వీస్ మొత్తం ఎందుకూ పనికి రాకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు పాత వారిని కొనసాగిస్తారా లేక కొత్తవారిని తీసుకుంటారా అనే భయాందోళనలో ఉన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో రాష్ట్ర నాయకత్వం సూచనలమేరకు వచ్చేనెల 10, 17, 24 తేదీల్లో మూడు రోజులపాటు విధులు బహిష్కరించేందుకు నిర్ణయించినట్లు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రదీప్ తెలిపారు.

అరటి రైతు విలవిల

- ధరలు లేక దిగాలు
- గతంలో రూ.500 పలికిన గెల ధర నేడు రూ.300
- ఆవేదనలో అరటి రైతు



సీతంపేట సంతకు గిరిజనులు తీసుకువచ్చిన అరటి గెలలు

సీతంపేట: అరటి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. కష్టానికి తగిన ఫలితం రావడంలేదని ఆవేదన చెందుతున్నారు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 500 ఎకరాల్లో అరటి పంటను సేంద్రియ పద్ధతిలో రైతులు సాగుచేస్తున్నారు. ఇక్కడి అరటి పండ్లకు గతంలో మంచి డిమాండ్ ఉండేది. గెల సైజును బట్టి రూ.500 నుంచి రూ.600వరకు ధర పలికేది. ఇప్పుడు రూ.300 నుంచి రూ.400 ధర పలుకుతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొండలపై నుంచి వారపుసంతలకు తీసుకువచ్చిన శ్రమకు తగ్గ ఫలితం రావడంలేదని చెబుతున్నారు. గతేడాది వరకు ఎకరాకు సరాసరి అరటి పంట వల్ల రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేదని, ఇప్పుడు రూ.50 వేలలోపే ఆదాయం వస్తోందని చిన్నబగ్గ, మర్రిపాడు, దోనుబాయి, పెదరామ, కడగండి, పొల్ల, శంబాం తదితర ప్రాంతాల రైతులు చెబుతున్నారు. ఎర్ర అరటి పండ్ల ధర కూడా పడిపోయిందని వాపోతున్నారు.

మోసిన కష్టం తీరడం లేదు..



కొండలపై పండించిన అరటి గెలలను మోసుకుని సంతలకు తీసుకువస్తాం. తీరా ఇక్కడ చూస్తే ధరలు గిట్టుబాటు కావడం లేదు. మళ్లీ కొండలపైకి మోసుకెళ్లలేక వ్యాపారులు అడిగిన ధరకే విక్రయిస్తున్నాం.

– ఎస్.నరేష్, వంబరెల్లి

ఆదుకోవాలి



గిరిజన ప్రాంతాల్లో పండిస్తున్న అరటికి పట్టణాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఆ ధరలు మాత్రం మాకు ముట్టడం లేదు. ప్రభుత్వం స్పందించి గిరిజన రైతులను ఆదుకోవాలి. గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి. –వి.చలపతి, మర్రిపాడు

క్లుప్తంగా

నకిలీ స్టాంపులు విక్రయిస్తే కఠిన చర్యలు

- సబ్‌రిజిస్ట్రార్ శ్రీనువాసులు
- సాక్షి కథనానికి స్పందన



శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: మండల కేంద్రంలో స్టాంపులను కలర్ జిరాక్స్ తీసి విక్రయిస్తున్నారని శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'జోరుగా నకిలీ స్టాంపుల విక్రయాలు' కథనంపై అధికారులు స్పందించారు.ఈ మేరకు పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం తయాచేస్తున్న స్టాంపుల మాదిరిగా నకిలీవి తయారుచేస్తే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని సబ్ రిజిస్ట్రార్ హెచ్చరించారు.కొద్దిరోజుల్లో వీరఘట్టం-పాలకొండ పట్టణాల్లో కలర్ జిరాక్స్‌లు తీస్తున్న అన్ని షాపులు తనిఖీ చేస్తామన్నారు. అలాగే ప్రజలు కూడా తమ అవసరాలు కోసం ప్రైవేట్ షాపుల్లో కొనుగోలు చేస్తున్న స్టాంపులు నకిలీవా? ఒరిజనల్‌వా? అని పరిశీలించుకోవాలని సూచించారు. స్టాంపుల విక్రయాలకు ప్రైవేట్ జిరాక్స్ షాపులకు ఎటువంటి అనుమతులు లేవని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఖలీల్‌బాబుకు స్పిరిట్యువల్ సైంటిస్ట్ అవార్డ్


స్పిరిట్యువల్ సైంటిస్ట్ అవార్డు అందుకుంటున్న ఖలీల్‌బాబు

విజయనగరం టౌన్: విశ్వసమైక్యతకు కృషిచేస్తున్న సూఫీ పరంపర వారసుడు, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఖలీల్‌బాబుకు ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్, ఆంధ్రాయూనివర్సిటీ అనుబంధ డీన్ వాన్‌ల్యూవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్, ఆంధ్రా యూనివర్సిటీ సంయుక్తంగా స్పిరిట్యువల్ సైంటిస్ట్ అవార్డును అందజేశాయి. ఈ మేరకు శుక్రవారం డీన్‌వాన్ వాన్‌ల్యూవెన్ సెంటర్ ఈడీ చల్ల కృష్ణ విజయనగరంలో ఉన్న దర్గాకు వచ్చి ఖలీల్‌బాబును సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఖాదర్‌బాబాపై భక్తితో తాను స్వయంగా రాసిన ఇంగ్లీష్ కవితలతో కూడిన పుస్తకాన్ని ఖలీల్‌బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ పీవీ.గోపాలరాజు, అహమ్మద్ బాబు, రంగారావు బాబాయ్, సంతోష్, జ్ఞానేశ్వర్, ఖాదర నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

బత్తిలి పోలీసుల ఔదార్యం

- ఆరు తులాల బంగారంతో బ్యాగ్ అప్పగింత

భామిని: మండలంలోని బత్తిలి పోలీసులు బంగారం పోగొట్టుకొన్న బాధితుల విషయంలో శుక్రవారం తమ ఔదార్యం చాటుకుని ఆదర్శంగా నిలిచారు. బత్తిలి వచ్చే ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ఆరు తులాల బంగారు వస్తువులతో ఉన్న బ్యాగ్‌ను బాలేరుకు చెందిన బాధితులు వడ్డివాడ రామకృష్ణ దంపతులకు అప్పగించి ప్రజల మెప్పు పొందారు. కొత్తకోట నుంచి ఆర్టీసీ బస్సులో బాలేరు వస్తూ బంగారు వస్తువులు ఉన్న బ్యాగ్ మరిచిపోయి వారు దిగిపోయారు. వెనువెంటనే బాలేరు వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిబోయిన చలపతి ఆధ్వర్యంలో బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో బత్తిలిస్టేషన్ సిబ్బందికి సమాచారం అందించి ఆర్టీసీ బస్సులో బంగారు వస్తువులతో గల బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. బత్తిలి స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు చలపతి సమక్షంలో బాధితులకు బంగారు వస్తువుల బ్యాగ్ అందించి పలువురి మన్ననలు పొందారు.

ఘనంగా ముగిసిన దుర్గాలమ్మ తీర్థం


ఉత్సాహంగా పరుగుతీస్తున్న ఎడ్ల బండి

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామదేవత దుర్గాలమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 8 ఎడ్లబళ్లు పాల్గొనగా వాయిల్పాడుకు చెందిన శ్రీమరిడిమాంబ ఎడ్లు ప్రథమస్థానం సాధించాయి. కలగాడకు చెందిన పోలిపర్తి సత్తిబాబు ఎడ్లు ద్వితీయ స్థానం, వావిలపాడుకు చెందిన పరిదేశమ్మతల్లి ఎడ్లు తృతీయ స్థానం, దేవరాపల్లికి చెందిన వీరాంజనేయ ఎడ్లు నాలుగవ స్థానం, దేవరాపల్లికి చెందిన శ్రీలక్ష్మీనరసింహా ఎడ్లు 5వ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	170

పొలంపిలుస్తోందికి స్పందన కరువు

- వారానికి నాలుగు గ్రామాల్లో నిర్వహించాలి
- రెండు గ్రామాల్లో నిర్వహించి మమ అనిపిస్తున్న వైనం
- కార్యక్రమాలకు ఇతరశాఖల అధికారుల గైర్హాజరు
- పట్టించుకోని అధికారులు


పార్వతీపురం మండలంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం (ఫైల్)

పార్వతీపురం టౌన్: రైతులకు సాగుపై అవగాహన కల్పించి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఇందులో వ్యవసాయశాఖ అధికారులతో పాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రైతులకు వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు గ్రామాల్లోని రైతుల క్షేత్రాలను సందర్శించడంతో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, పురుగు, తెగులు నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అన్ని సమస్యలపై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు మినహా మిగిలినవారు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాలు చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. కాని నిబంధనలకు విరుద్ధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో లక్ష్యానికి దూరంగా సాగుతోంది.

కార్యక్రమం నిర్వహణ ఇలా..

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ లక్ష్యంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పొలం బాట, పంటసాగుపై చర్చలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర సమస్యలకు తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహించాలి.

మిగతా అధికారులు ఎక్కడ?

'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీష్, వెటర్నరీశాఖ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, విద్యుత్, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వారితో పాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీ, సబ్సిడీలను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. 2024-25 ఏడాదికి సంబంధించి సెప్టెంబరు 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి విడత షెడ్యూల్ పూర్తయి ప్రస్తుతం రెండో విడత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటి షెడ్యూల్‌లో జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. మిగిలిన శాఖ అధికారుల జాడ లేదని రైతులు వాపోతున్నారు.

ముందస్తు సమాచారం లేక కార్యక్రమం డీలా!

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై చాలా మందికి అవగాహన భ్రమగానే మారిందని విమర్శలు ఉన్నాయి.

అనుబంధ శాఖల అధికారులు హాజరు కావాలి

'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు అన్ని అనుబంధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. ఆయా శాఖల పథకాలను తెలియజేసి, రైతుల సమస్యలు పరిష్కరించాలి. అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపడతాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

దొంగల వీరవిహారం..!

- గజపతినగరంలో 8 షాపుల్లో చోరీ
- షాపుల షట్టర్లు ధ్వంసం నగదు, వస్తు సామగ్రి అపహరణ


చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ భవ్య తదితరులు

గజపతినగరం: మండల కేంద్రంలో శుక్రవారం వేకువజామున మూడుగంటల ప్రాంతంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ నేపథ్యంలో 8షాపుల షట్టర్లను ధ్వంసం చేసి నగదు, వస్తుసామగ్రి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరంలో ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న 8షాపులను దొంగలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ 8షాపుల్లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వెంకి మొబైల్ అండ్ గిఫ్ట్ ఆర్టికల్స్ షాపులో 27సెల్‌ఫోన్‌లు, రూ.లక్షా51వేల 420 నగదు చోరీకి పాల్పడినట్లు షాపు యజమాని తెలిపారు. దీంతో పాటు గజపతినగంలో డీ మార్ట్స్, ఆర్‌కే ఫ్యామిలీ మార్ట్, సూపర్ ఎం, ఉమెన్స్/కిడ్స్ జోన్, ఎస్ఎస్ ఫుట్ వేర్, వెంకటేశ్వర కిరాణా అండ్ జనరల్ స్టోర్స్, తిరుమల ట్రేడర్స్, ఎస్ఎస్ ఫుట్‌వేర్ మొత్తం 8షాపుల షట్టర్లను ధ్వంసం చేసి కౌంటర్‌లలో ఉన్న నగదు, వస్తువులను దొంగిలించారు. ఉమెన్/మెన్/కిడ్స్ జోన్ బట్టల షాపులో కౌంటర్‌లో ఉన్న నోట్లు రూ.10వేలు, చిల్లర రూ.5వేలు మొత్తం రూ.15వేలు పోయినట్లు యజమాని ఆగూరు ఆచారి తెలిపారు. అలాగే మిగతా షాపుల్లో కూడా కొంత నగదు, వస్తువులు పోయినట్లు బాధితులు తెలిపారు.

సంఘటనా స్థలానికి డీఎస్పీ, క్లూస్ టీమ్


గజపతినగరం టౌన్‌లోను, మెంటాడ జంక్షన్‌లో చోరీకి గురైన 8షాపులను డీఎస్పీ భవ్య క్షేత్ర స్థాయిలో పరిశీలించి దొంగతనం జరిగిన తీరును స్థానిక సీఐ జీఏవీ రమణ, ఎస్సై లక్ష్మణరావులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్‌టీమ్ ద్వారా వివరాలను, ఫింగర్ ప్రింట్‌లను తీయించి దర్యాప్తు చేశారు. సీసీపుటేజీల ద్వారా దొంగలను గుర్తించి వారిజాడ కనిపెట్టి అదుపులోకి తీసుకునేలా దర్యాప్తు చేయాలని స్థానిక ఎస్సై లక్ష్మణరావును ఆదేశించారు. సీసీ పుటేజీల్లో ఇద్దరు వ్యక్తులు మాత్రమే కనిపిస్తున్నారు. 8షాపులను ఒకేరోజు షట్టర్లు పగులగొట్టి లోపలికి ఎలా ప్రవేశించారో అంతుపట్టని విధంగా సినీఫక్కీలో చోరీ జరిగినట్లు ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. డీఎస్పీ భవ్య వెంట క్లూస్ టీమ్ సిబ్బందితో పాటు స్థానిక సీఐ, ఎస్సైలు జీఏవీ రమణ, లక్ష్మణరావులు ఉన్నారు.


వెంకి మొబైల్ అండ్ గిఫ్ట్ ఆర్టికల్స్ షాపులో సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న దుండగులు

పోలీసుల వైఫల్యానికి నిదర్శనం: సీపీఎం

గజపతినగరం: ఎన్నడూ లేనివిధంగా ఒకేరోజు గజపతినగరంలో 8షాపుల్లో చోరీ జరగడం పోలీసుల వైఫల్యమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్, రాకోటి రాములు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం గజపతినగరం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా దొంగతనాలు జరగడం దుర్మార్గమన్నారు. గజపతినగరంలో గంజాయి, బెట్టింగులజోరు, మత్తులో తగాదాలు, కత్తులతో పొడుచుకునే సంఘటనలు, ఏసమయంలోనైనా మద్యం దొరకడం వంటివి పెరిగి పోవడంతో సమాజం పూర్తిగా ఛిన్నాభిన్నం అయిపోయిందన్నారు. దీనిని గాడిలో పెట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. 8షాపుల్లో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు వేగవంతంగా పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


విద్యార్థి మండ రాజా మృతదేహం


డెంకాడ: విజయనగరం జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఈ ప్రమాదాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలో గల డీజే దాబా ఎదురుగా విజయనగరం-నాతవలస ఆర్ అండ్‌బీ రహదారిపై జరిగిన ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం చెందాడు. పెదతాడివాడ వద్ద ఉన్న ఒక కల్యాణ మంటపంలో ఫంక్షన్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా, ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో విద్యార్థి మండ రాజా(17) అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి మండ గంగరాజు మండలంలోని పినతాడివాడలోని ఒక చర్చిలో పాస్టర్‌గా ఉంటూ కుటుంబంతో పాటు జీవనం సాగిస్తున్నారు. మృతుడి తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

కారు ఢీకొని మహిళ..


రమ మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని కామవరం జంక్షన్‌లో జాతీయరహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడక్కడే మృతి చెందింది. పూసపాటిరేగ మండలకేంద్రంలోని కుసుకువారి కళ్లాలకు చెందిన పతివాడ రమ (32) కామవరం జంక్షన్‌లో గుడికి వెళ్లే నిమిత్తం రహదారి దాటుతుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. మృతురాలికు భర్త తవిటి నాయుడుతో పాటు ఇద్దరు కుమారులు తరుణ్, మహేంద్రలు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు 55 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు ఉంటుంది. మృతుడి జేబులో శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్‌కు జనరల్ టికెట్ కూడా ఉంది. అంతేకాకుండా మృతుడు ధరించిన తెలుపు రంగు చారల షర్టుపై ఆరాధన టైలర్స్, ఎస్.పేట అనే లేబుల్ ఉంది.

26న జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు

బొండపల్లి: ఈనెల 26న మండలంలోని కొత్తపాలెం గ్రామంలో శ్రీ కృష్ణమ్మ పేరంటాలు తల్లి మహోత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలతో పాటు ఎడ్లబళ్ల ప్రదర్శన పోటీలు, గుర్రపు స్వారీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, గ్రామ సర్పంచ్ బొడ్డు సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.4 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీల్లో విజేతలకు నగదు పారితోషకాలను అందజేయడంతో పాటు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజలు, పోటీదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు


పోలీస్‌స్టేషన్‌లో గంజాయితో పాటు నిందితులను చూపిస్తున్న పోలీసులు

విజయననగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను గురువారం అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రేవతి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు. రాయగడ, విజయనగరానికి చెందిన ఇద్దరు యువకులు చెడు వ్యసనాలను అలవాటు పడి డబ్బుల కోసం గంజాయి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు విజయనగరం ఓల్డ్ రైల్వే క్వార్టర్స్ వద్ద ఇద్దరు నిందితులు గంజాయి ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రేవతి ఘటనా స్థలికి వెళ్లి నిందితులను పట్టుకుని విచారణ చేసి వారి దగ్గర ఉన్న రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అదుపులోకి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

- అదుపులోకి 9 మంది నిందితులు
- రూ.13,760 నగదు స్వాధీనం


పట్టుపడిన నిందితులతో ఎస్సై నవీన్‌పడాల్, పోలీస్ సిబ్బంది

లక్కవరపుకోట: గ్రామాల్లో నిర్వహించే తీర్థాల సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలపై లక్కవరపుకోట పోలీస్‌లు కొరడా ఝుళిపించారు. కోడి పందాలు, ఏట్లాట (నాణాలు తిప్పే ఆట) వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఎస్సై నవీన్‌పడాల్ తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో గల మామిడి తోటల్లో రహస్యంగా నాణాలు తిప్పే జూదం ఆటపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ 10,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆదే గ్రామ శివారు గల పశువుల కళ్లాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై దాడి చేశారు. అక్కడ పందాలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 కోడి పుంజులు, రూ.3,560 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత మృతిపై కుటుంబ సభ్యుల అనుమానం


దేవిప్రియ (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నీలంరాజు పేటకు చెందిన వివాహిత దేవిప్రియ(21) విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందిన ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన దేవిప్రియ, నెల్లిమర్ల మండలంలోని నీలంరాజుపేటకు చెందిన లోకనాథం నాలుగు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి విజయనగరం పట్టణంలోని పూల్‌బాగ్‌లో అద్దెఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల దేవిప్రియ అనారోగ్యానికి గురికావడంతో భర్త తొలుత నెల్లిమర్ల మిమ్స్‌కు తీసుకువెళ్లాడు. ఛాతీలో నొప్పి రావడంతో మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే దహన సంస్కారాల నిమిత్తం భర్త, బంధువులు దేవి ప్రియ మృతదేహాన్ని స్వగ్రామమైన నీలంరాజుపేటకు శుక్రవారం తీసుకువచ్చారు. విషయం కాస్తా మృతురాలి తల్లిదండ్రులకు తెలియడంతో వారు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ బిడ్డ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ ఘటన విజయనగరం పరిధిలో జరగడంతో అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించగా వివాహిత కుటుంబ సభ్యులు విజయనగరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కాగా నీలంరాజుపేటలో వివాహిత మృతదేహాన్ని ఏఎస్సై సతీష్, సిబ్బంది పరిశీలించారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

- గుడ్లు, మాంసం రవాణాపై ఆంక్షలు లేవు
- పశు సంవర్ధక శాఖ జేడీ వైవీ రమణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వైవీ రమణ

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల పెంపకం పరిశ్రమ కలిగిన రైతులు, పౌల్ట్రీ యాజమానులు జిల్లాలోని కోళ్లకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా జీవ భద్రత చర్యలు చేపట్టాలని పశు సంవర్ధకశాక జేడీ డాక్టర్ వైవీ రమణ తెలిపారు. కోళ పరిశ్రమ యాజమానులు, రైతులకు శుక్రవారం పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, గుడ్లు, కోడి మాంసం ఉత్పత్తులను 100 డిగ్రీల సెంటీగ్రేడ్‌లో వండుకుని ప్రజలు అందరూ నిర్భయంగా తినొచ్చని పేర్కొన్నారు. కోడిగుడ్లు, మాంసం ఉత్పత్తులపై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్‌తో కలిసి పశు సంవర్ధకశాఖ త్వరలో కోడిమాంసం, గుడ్ల వంటకాలతో జిల్లా కేంద్రంలో త్వరలోనే ఒక మేళాను నిర్వహించి ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో బహుళార్థ పశు వైద్యశాల ఉప సంచాలకురాలు డాక్టర్ జి.మహాలక్ష్మి, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు డాక్టర్ ఎంబీవీ ప్రసాద్, ఎ.డి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా 'శారద' జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

- ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన 9 జట్లు
- రెండు రోజుల పాటు జరగనున్న పోటీలు


ఉత్కంఠభరితంగా సాగుతున్న వాలీబాల్ పోటీలు


9 నియోజకవర్గాల క్రీడాకారులతో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, శారద కర్మాగారం ప్రతినిధులు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ లిమిటెడ్ కర్మాగారం సహకారంతో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు కొత్తవలస -విజయనగరం రోడ్డులో గల బారత్ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌లో శుక్రవారం ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, శారద పరిశ్రమ వైస్‌ప్రెసిడెంట్ సనత్ కుమార్, ప్రభాత్ మోహన్ ప్రారంభించారు. జాతీయ వాలీబాల్ కోచ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవర సూరిబాబు, స్కూల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.కృషంరాజుల నిర్వహణలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో గల 9 నియోజకవర్గాల నుంచి ఒక్కో టీమ్ వచ్చినట్లు తెలిపారు. ప్రతి టీమ్‌కు 10 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ పోటీలు లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.1,25,000, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.60,000, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30,000, నాల్గోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.25,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, క్రీడాకారులకు టీషర్టులను, బాల్స్, నెట్‌లను శారద కర్మాగారం సమకూర్చినట్లు తెలిపారు. శనివారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కదారి రాజు, సర్పంచ్‌లు మదినా అప్పలరమణ, పీతల కృష్ణ, శారద కార్మగారం ప్రతినధులు ఆశోక్ కుమార్ చౌదరి, మూర్తి, హెచ్.సన్యాసిరావు, జి.శంకరావు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా


గెలిచిన టీమ్‌లకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత సురానా

సాలూరు రూరల్: పార్వతీపురం జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గడిచిన మూడు నెలల పాటు నిర్వహించి శుక్రవారం మండలంలోని తోణాం గ్రామంలో సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో సాలూరు మండలం మెండంగి గిరిజన యువత విజేతలుగా నిలిచారు. అలాగే ద్వితీయ స్థానంలో మక్కువ మండలం కోన టీమ్ గెలుపొందింది. గెలుపొందిన టీమ్‌లకు ఎస్పీ మాధవ రెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా మహరాణా బహుమతులు అందజేశారు. అలాగే సెమీ ఫైనల్‌లో పాల్గొన్న పాచిపెంట, మక్కువ, సాలూరు, పార్వతీపురం రూరల్ టీమ్‌లకు వాలీబాల్ కిట్లతో పాటు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ రెడ్డి మాట్లాడుతూ గిరిజన యువతకు ఆటలపోటీలపై ఆసక్తిని పెంపొందించేందుకు పోలీసుశాఖ తరపున ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలో మత్తుపదార్థాలు ఎవరైనా సరఫరా చేసినట్లు సమాచారం తెలిసినట్లు అయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదుచేయబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై, నరసింహమూర్తి పోలీసులు పాల్గొన్నారు.